ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఏకాగ్రత చెస్ అకాడమీలో రెండురోజుల శిక్షణ శిబిరాన్ని రష్యాకు చెందిన ప్రముఖ చదరంగం క్రీడాకారుడు, సూపర్ గ్రాండ్ మాస్టర్ సెర్జి తివియాకోవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో అకాడమీ సీఈవో సందీప్ నాయుడు, గ్రాండ్ మాస్టర్స్ శ్లోక దండు, తనీశ్ తదితరులు పాల్గొన్నారు.

-బంజారాహిల్స్, జనవరి 28

డీసీసీఐ ఇండియా, ఇంగ్లండ్ సిరీస్ మేనేజర్‌గా చంద్‌భాన్ గిర్

అంబర్‌పేట, జనవరి 28 : డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీసీఐ)(బీసీసీఐ సపోర్టెడ్ బాడీ) ద్వారా ఇండియా వర్సెస్ ఇంగ్లండ్ ఫిజికల్ డిజబులిటి క్రికెట్ సిరీస్ మేనేజర్‌గా నల్లకుంట హిందీ మహావిద్యాలయం క్రికెట్ కోచ్ చంద్‌భాన్ గిర్ నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీఐ ప్రధాన కార్యదర్శి రవికాంత్ చౌహాన్ చంద్‌భాన్ గిర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఈ సిరీస్ జరగనుంది. ఈ సందర్భంగా చంద్‌భాన్ గిర్ మాట్లాడుతూ తనను సిరీస్ మేనేజర్‌గా నియమించిన డీసీసీఐ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

బౌ బోయ్

- గ్రేటర్‌లో రెచ్చిపోతున్న వీధి కుక్కలు
- నియంత్రణను గాలికొదిలేసిన బల్దియా

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో వీధి కుక్కల బెడదతో జనం బెంబేలెత్తుతున్నారు. వాటి కాటుకు గురై ఆస్పత్రులకు వస్తున్న బాధితులు నానాటికీ పెరుగుతున్నారు. నారాయణగూడలోని ఐపీఎంకు కుక్క కాట్లతో దాదాపు 200 మంది బాధితులు క్యూ కడుతున్నారంటే పరిస్థితి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు జీహెచ్‌ఎంసీ వీధి కుక్కల నియంత్రణను గాలికి వదిలేసింది. తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నది. ప్రధానంగా వీధి కుక్కలకు ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్), రేబిస్ నివారణ టీకాలు వేయడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏడాది కిందట 5.7 లక్షల కుక్కలు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. 70 శాతం శునకాలకు ఏబీసీ ఆపరేషన్లు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన వాటికి శస్త్రచికిత్సలు జరగాల్సి ఉందన్నారు. అయితే ఇటీవల మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన హైలెవల్ కమిటీ సమావేశంలో వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులు సరైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో మేయర్‌తో పాటు అన్ని పార్టీల కార్పొరేటర్లతో ఏర్పాటైన హై లెవల్ కమిటీ సభ్యులు తీవ్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు.

వీధి కుక్కలకు.. యాంటీ రేబిస్ టీకాలు

మణికొండ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ కాళోజీ పార్కులో బ్లూ క్రాస్ సంస్థ సహకారంతో అదివారం వీధి కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, సినీనటి అక్కినేని అమల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, 300లకు పైగా వీధి కుక్కలకు టీకాలు వేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

- మణికొండ, జనవరి 28

ఆదివారం అబిడ్స్ డాక్ సదన్‌లో 'సీతారామచంద్ర స్వామి భద్రాచలం స్టాంప్'ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి దేవుసిన్హ్ చౌహాన్, చిత్రంలో సీపీఎంజీ, సీవీఎస్ రెడ్డి, డీపీఎస్, కె.ఎ.దేవరాజ్, కార్పొరేటర్ బి.సురేఖ, పీఎంజీ, టీఎం శ్రీలత, ఆర్పీవో స్నేహజ జొన్నలగడ్డ

మార్చి 25న సనాతన వేదాంత జ్ఞాన సభలు

ఎన్ఎస్ఎస్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాశెట్టి పాండు గుప్తా తదితరులు

హిమాయత్‌నగర్,జనవరి28: రాష్ట్రంలో తొలిసారిగా 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలను మార్చి 25 నుంచి 27వ తేదీ వరకు బాలాపూర్‌లోని ఎస్‌పీఆర్ శ్రీ లక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ కన్వీనర్ కాశెట్టి పాండు గుప్తా తెలిపారు. జ్ఞాన సభలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జ్ఞాన సభలకు వందమంది పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామిజీలు, మాతాజీలు హాజరై భక్తులకు ప్రవచనాలు చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మహాసభ అధ్యక్షుడు నరాబు లక్ష్మణ్ గుప్తా, కృష్ణ ప్రసాద్, చంద్రశేఖర్ రావు, లింగా ప్రకాశ్ గుప్తా, శ్రీరాంగుప్తా, లక్ష్మయ్యగుప్తా, శ్రీనివాస్ గుప్తా, విశ్వేశ్వరయ్య గుప్తా, పురుషోత్తం చారి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 18న ఆస్ట్రేలియాలో సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్

కర్టన్ రైజర్‌లో సందడి చేసిన టాలీవుడ్ హీరోలు..

జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ లోగో, జర్సీలను ఆవిష్కరిస్తున్న టాలీవుడ్ హీరోలు

బంజారాహిల్స్, జనవరి 28: వెండితెర మీదనే కాదు క్రికెట్ గ్రౌండ్‌లో కూడా తమ సత్తా చాటుతున్న దక్షిణాదికి చెందిన పలువురు సినీ తారలు మొట్టమొదటిసారిగా ఆస్ట్రేలియాలో స్థానిక లీగ్ క్రికెటర్లతో కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడనున్నారు. టాలీవుడ్ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ), క్రికెట్ కార్నివాల్ ఆస్ట్రేలియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 18న ఆస్ట్రేలియాలోని జస్ట్ మెల్‌బోర్న్‌లో నిర్వహించనున్న సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ 2024, సీజన్ -1 కు సంబంధించిన కర్టన్ రైజర్ కార్యక్రమం ఆదివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో జరిగింది. నిర్మాత దిల్ రాజు, భారత మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, నటులు శ్రీకాంత్, తరుణ్, సుధీర్‌బాబు, నిఖిల్, సుశాంత్, సంగీత దర్శకుడు తమన్, నిర్వాహకులు వంశీ, సాయి కృష్ణ తదితరులు టోర్నీ లోగోలను, జెర్సీలను ఆవిష్కరించారు. ఈ టోర్నీ ద్వారా వచ్చిన లాభాలను క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల చికిత్స కోసం వినియోగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు, ఆది శ్రీనివాస్, ప్రిన్స్, ఓంకార్, డీజే సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఇవీ మన మూలాలు పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ సంపాదకుడు రామచంద్రమూర్తి తదితరులు

ఖైరతాబాద్, జనవరి 28 : రచయిత కల్లూరి భాస్కరం రచించిన 'ఇవీ మన మూలాలు' పుస్తకం చదివితే అన్ని గ్రంథాలు చదివిన అనుభూతిని కలిగిస్తుందని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం 'ఇవీ మన మూలాలు' పుస్తకాన్ని జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించి, తొలిప్రతిని సీనియర్ సంపాదకుడు కె. రామచంద్రమూర్తికి అందజేశారు. సాహితీవేత్త, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు పుస్తక సమీక్ష చేయగా, విద్యావేత్త, రచయిత బీపీ పడాల పుస్తక పరిచయం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పుస్తకం ద్వారా రచయిత చేసిన సత్యాన్వేషణ అరుదైన ఆభరణమన్నారు. ఈ పుస్తకంపై అధ్యయనం జరగాలని, పురావస్తు శాఖ, శాస్త్రవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి, రచయిత్రి కుప్పిలి పద్మ, రచయిత, రాజకీయ విశ్లేషకులు శ్రీశైల్ రెడ్డి పంజుగుల, పలువురు సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్ వాసికి జ్యోతిష్యరత్న అవార్డు ప్రదానం

నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ డివిజన్ రవీంద్రనగర్‌కు చెందిన బీజీ సురేశ్ జ్యోతిష్యరత్న అవార్డును ఆదివారం అందుకున్నారు. భారతీయస్టేట్ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసే బీజీ సురేశ్ జ్యోతిష్యంపై మక్కువతో విజయవాడకు చెందిన పుచ్చా శ్రీనివాసరావు వద్ద జ్యోతిష్యం నేర్చుకున్నారు. సురేశ్‌కు నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో యాదాద్రి నరసింహస్వామి దేవస్థానం ప్రధాన ఆచార్యులు నల్లందింగలల్ నరసింహాచార్యులు జ్యోతిష్యరత్న అవార్డును అందజేశారు.

- మెహిదీపట్నం జనవరి 28

ధీరజ్‌కు బంగారు పతకం

ప్రధాని నరేంద్ర మోదీ నుంచి బంగారు పతకాన్ని అందుకుంటున్న విద్యార్థి నాగండ్ల ధీరజ్

దుండిగల్, జనవరి 28: బాచుపల్లి పరిధిలోని వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాల 9వ తరగతి విద్యార్థి నాగండ్ల ధీరజ్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఈ నెల 1వ తేదీన నుంచి న్యూ ఢిల్లీలో జరుగుతున్న రిపబ్లిక్ డే ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొన్న ధీరజ్.. జూనియర్ నేవీ క్యాటగిరిలో అత్యుత్తమ ప్రతిభకనబరిచి ప్రధాన మంత్రి బంగారు పతకానికి ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఢిల్లీలోని కరియప్ప గ్రౌండ్‌లో జరిగిన 'అమృత్‌కాల్ కీ ఎన్‌సీసీ' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఈ వేడుకల్లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, డిఫెన్స్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్, ఆర్మీచీఫ్ జనరల్ మనోజ్‌పాండే, ఎయిర్‌ఫోర్స్ చీఫ్, చీఫ్ మార్షల్ వివేక్‌రామ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయ రాణి మాట్లాడుతూ.. ధీరజ్ సాధించిన ఈ విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమన్నారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా విశ్వక్‌సేన్

ముంబైలో ప్రారంభించిన హెచ్‌పీఎస్ఎల్ (హార్స్ పవర్ స్పోర్ట్స్ లీగ్) తెలుగు టీమ్ బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ హీరో విశ్వక్‌సేన్ నియమితులయ్యారని ఆదివారం జూబ్లీహిల్స్‌లోని రామానాయుడు స్టూడియోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌పీఎస్ఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేశ్ పాలడుగు తెలిపారు.

- బంజారాహిల్స్, జనవరి 28

టీహబ్‌లో డీప్ స్టార్టప్‌లకు ప్రోత్సాహం

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): నూతనంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలతో ఆవిష్కరణలు చేసే ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లర్నింగ్(ఎంఎల్), ఏఆర్, వీఆర్, బ్లాక్ చెయిన్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి టెక్నాలజీలతో స్టార్టప్‌లను ప్రారంభించే వారికి టీ హబ్ వేదికగా అవసరమైన మద్దతు ఇచ్చేలా ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు ఈ కింది లింకు https://bit.ly/3Ratafwలో సంప్రదించాలని తెలిపారు.

సైకిల్ యాత్ర

జమ్మూలోని వైష్ణోదేవి ఆలయానికి సైకిల్‌పై యాత్రకు వెళుతున్న మల్కాజిగిరి గీతానగర్‌కు చెందిన సల్లా శ్రీనివాస్

- మల్కాజిగిరి, జనవరి 28

త్వరలో 2375 కొత్త బస్సులు

టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్

బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సజ్జనార్

తెలుగు యూనివర్సిటీ, జనవరి 28 : ఆర్టీసీలో అనౌన్స్‌మెంట్, ఎంక్వయిరీ రూమ్ జాబ్‌లలో బ్లైండ్స్‌కు అవకాశం కలిపిస్తామని టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హామీనిచ్చారు. నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో తెలంగాణ బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రూపొందించిన క్యాలెండర్‌ను సజ్జనార్ ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కారణంగా దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో మహిళలు కూర్చుంటున్నారని, దీంతో వారు ఇబ్బందులకు గరవుతున్నారన్నారు. త్వరలోనే 2375 కొత్త బస్సులు తీసుకుంటున్నామని తెలిపారు. బ్లైండ్ విద్యార్థులు పరీక్షలు రాయడానికి మంచి రైటర్స్‌ను ఏర్పాటు చేస్తామని ఓయూ వీసీ, ప్రొఫెసర్ రవీందర్ తెలిపారు. బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీఓ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, ఎం.వీరయ్య, హైకోర్టు న్యాయవాది వినీత ఠాకూర్, సంఘం ప్రధాన కార్యదర్శి బి.రాఘవేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి రవీందర్, కోశాధికారి జి.మల్లేశ్ పాల్గొన్నారు.

పురస్కారాలు, బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఘనంగా హెరిటేజ్ ఫెస్ట్

రవీంద్రభారతి, జనవరి 28: యువతలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను పెంపొందించడానికి హరేకృష్ణ మూవ్‌మెంట్ చేస్తున్న కృషి అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి ప్రియదర్శిని అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాలులో హరేకృష్ణ మూవ్‌మెంట్ వార్షిక సాంస్కృతికోత్సవ సంబురాలను ఘనంగా నిర్వహించారు. హెరిటేజ్ ఫెస్ట్ పేరిట నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జస్టిస్ ఎం.జి ప్రియదర్శిని హాజరై పలువురికి పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. సంప్రదాయ నృత్యం, నాటకం, శాస్త్రీయ సంగీతం, చిత్రలేఖనం,కథలు చెప్పడం, జానపద నృత్యం, గాత్ర సంగీతం, వక్తృత్వ, రంగోలి తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 200లకు పైగా పాఠశాలల్లో 2వేల మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించామని హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ తెలిపారు. సభకు ముందు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. సుమేధన ఆధ్వర్యంలో నిర్వహించిన కళాప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళా ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

ఎల్బీనగర్, జనవరి 28: తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ గురుకుల న్యాయ కళాశాలలో మహిళా గెస్ట్ ఫ్యాకల్టీల కోసం, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మానస తెలిపారు. ఈ పోస్టులకు కనీసం ఎల్ఎల్ఎంలో పీజీ ఏదైనా స్పెషలైజేషన్ చేసి ఉండాలని, ఎవరైతే నెట్, సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసి ఉంటారో వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోస్టుల కోసం పీఆర్ఎల్-ఆర్‌డీసీడబ్ల్యూ - ఎల్‌బీఎన్ జీఆర్-ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ఎట్ తెలంగాణ జీవోవీ.ఎన్ వెబ్ సైట్‌లో, లేదా ఫోన్ నంబర్ 96036 17134 కు వాట్సాప్‌లో పేరు, రెజ్యూ మ్, సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు పంపించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 31న దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని ఎస్సీ గురుకుల మహిళా న్యాయ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

ఓయూ వందేండ్ల వైభవం నేడు లైట్ అండ్ షో

జూబ్లీహిల్స్, జనవరి 28 : కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీలో సోమవారం లైట్ అండ్ షో కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. 1917 నుంచి ఇప్పటివరకు వందేండ్ల ఓయూ ఆర్ట్స్ కాలేజీ చరిత్రను టెక్నాలజీ సాయంతో ఆవిష్కరించనున్నారు. పురావస్తు శాఖ సౌజన్యంతో రూపొందించిన ఈ లైట్ అండ్ షో కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ వాయిస్ ఓవర్ అందించారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ చరిత్రను వినూత్న విధానంలో వివరించేందుకు ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో సోమవారం ప్రారంభించనున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఓయూ గత వైభవాన్ని తెలుసుకునేందుకు విద్యార్థులకు ఇది గొప్ప అవకాశమని, ఉచితంగా నిర్వహించనున్న ఈ ప్రదర్శనను విద్యార్థులు చూడవచ్చని పేర్కొన్నారు.

హైటెక్స్‌లో ముగిసిన కామిక్ కాన్

కామిక్ కాన్‌లో దేవాస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నటుడు రాణా

మాదాపూర్, జనవరి 28: స్పైడర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్, సూపర్ మ్యాన్, ఐరన్ మ్యాన్‌ల వేషధారణతో కామిక్ కాన్‌లోని క్యారెక్టర్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఆదివారం ముగింపు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నటుడు రాణా దగ్గుబాటి, కామిక్ కాన్ వ్యవస్థాపకుడు జతిన్ హాజరై దేవాస్ అనే పుస్తకాన్ని రచయితతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని నగరం నలు మూలల నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున విచ్చేసి వీక్షించారు.

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న త్యాగరాజ సంగీత ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని కర్ణాటక సంగీత కళాకారుల గళార్చన ఘనంగా ముగిసింది. 500 మందికి పైగా సంగీత విద్వాంసులు త్యాగరాజు రచించిన ఘనరాగ పంచరత్న కృతులను కీర్తిస్తూ అలరించారు.

- కొండాపూర్, జనవరి 28

ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టాలి

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి

బంజారాహిల్స్, జనవరి 28: నైపుణ్యాలను పెంచడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా మరింత మంది ఉన్నత విద్యవైపు మొగ్గుచూపేలా చేయవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలోని సామాజిక శాస్త్ర విభాగం, ఉన్నత విద్యామండలి, ఐసీఎస్ఎస్ఆర్ ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఉన్నత విద్య- సమస్యలు, నాణ్యత, సమగ్రత కోసం సవాళ్లు' అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును ఆదివారం ప్రొ.లింబాద్రి ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్యతో పోలిస్తే తెలంగాణలో గణనీయమైన వృద్ధి నమోదవుతున్నదన్నారు. అయితే డిగ్రీ నుంచి పీజీకీ వెళ్లేవారు 15శాతానికి మించకపోవడానికి గల కారణాలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మాజీ వైస్ చాన్స్‌లర్, న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొ.వీఎస్.ప్రసాద్ మాట్లాడుతూ..జాతీయ విద్యావిధానం -2020 మార్గదర్శకాల ప్రకారం ఆధునిక టెక్నాలజీ, ఓపెన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అందరికి అందుబాటులో ఉన్నప్పుడే..దూరవిద్యలో కూడా నాణ్యతను పెంచవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.కే.సీతారామారావు, అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ.ఏవీఆర్ఎన్.రెడ్డి, ప్రొ. శ్రీనివాస్, డా.బి.శ్రీనివాస్, డా.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలే ముఖ్యం

సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): అత్యవసర పరిస్థితుల్లో చికిత్స కోసం వచ్చినప్పుడు.. వైద్యులు రోగి ప్రాణాలు కాపాడేందుకే ప్రాధాన్యత ఇవ్వాలని నిలోఫర్ దవాఖాన ఆర్ఎంవో, యువ నోడల్ అధికారి, సెంట్రల్ ఐఏపీ బోర్డు మెంబర్ డాక్టర్ రమేశ్ దాంపురి పేర్కొన్నారు. కేరళలోని కొచ్చిలో ఆదివారం జరిగిన పెడికాన్-2024 సదస్సుకు నిలోఫర్ దవాఖాన నుంచి ఆయన పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో చిన్నారులకు అందించాల్సిన వైద్యసేవలు, వాటి నియమ నిబంధనలు, మెడికో లీగల్ అంశాలను వివరించారు. 1989లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగి ప్రాణాలు కాపాడే బాధ్యత సదరు వైద్యులు, హాస్పిటల్స్‌పై ఉంటుందని గుర్తు చేశారు.